క్లుప్తంగా

అన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం గుంటూరు జిల్లా, పిడుగురాళ్ల మండలం, చెన్నైపాలెం గ్రామానికి చెందిన ఎం.రామకృష్ణ, శివపార్వతి దంపతులు రూ.10,000 ఆలయ ఇన్స్పెక్టర్ ప్రసాద్ చేతుల మీదుగా ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

రెవెన్యూ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, తదితరులు

వత్సవాయి(పెనుగంచిప్రోలు): వత్సవాయి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగుల డైరీని బుధవారం తహసీల్దార్ వైకుంఠరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ రవికుమార్, వీఆర్ఓల సంఘ అధ్యక్షుడు కుక్కల సురేష్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు



కచేరీ నిర్వహిస్తున్న సన్నాయి కళాకారులు

నందిగామ: స్థానిక ముక్కోటి మహా మండపంలో త్యాగరాజ స్వామి సేవా సమితి, సన్నాయి బ్యాండ్ కళాకారుల ఆధ్వర్యంలో బుధవారం త్యాగరాజ స్వామి 14వ ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. ముందుగా త్యాగరాజ స్వామి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఇందులో భాగంగా నిర్వహించిన సంగీత కచేరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం పలువురు కళాకారులను ఘనంగా సత్కరించారు.

తిరుపతమ్మ శాంతి కల్యాణం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయం తరపున విస్తృత ప్రచారంలో భాగంగా భక్తుల కోరిక మేరకు గురువారం బాపట్ల జిల్లా, అమర్తలూరు మండలం, మోపర్తి గ్రామంలో శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారి శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జీవీడీఎన్ లీలా కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ఈనెల 25న నందిగామ మండలం, అనాసాగరంలో శాంతి కల్యాణం నిర్వహించనున్నామన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

కంచికచర్ల : మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ కానూరు శిల్ప బుధవారం తెలిపారు. ఆధార్ కార్డు లేనివారు, ఒకవేళ కార్డు ఉన్నా మార్పులు, చేర్పులు చేసుకునే వారు, పిల్లల వేలిముద్రలు అప్‌డేట్ చేయించుకోవాల్సిన వారు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 19వ తేదీన మండలంలోని గండేపల్లి, గొట్టుముక్కల, 21న పెండ్యాల, పేరకలపాడు, 22న పరిటాల, వేములపల్లి, 23న కునికెనపాడు, గనిఆత్కూరు, 24న మోగులూరు, కొత్తపేట గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

నందిగామ: నగర పంచాయతీ పరిధిలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ పోస్టులకు అర్హత కలిగి, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో మొత్తం ఎనిమిది ఖాళీలు ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి, 18 సంవత్సరాలు పైబడి 35 ఏళ్ల లోపు ఉన్న వారు గ్రామ, వార్డ్ సచివాలయ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 27వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు.

షాదీఖానా కమిటీ చైర్మన్‌గా బాషా

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని షాదీఖానా కమిటీ చైర్మన్‌గా పట్టణానికి చెందిన ఎక్బైడ్ బాషా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం చైర్మన్‌గా నియమితులైన బాషా కమిటీ సభ్యుల వివరాలను తెలిపారు. షేక్ రహ్మతుల్లా, సయ్యద్ ఆలీ, షేక్ ఖాదర్‌బాబు, పఠాన్ సంసుంగ్, ఎండీ మహబూబ్ సుభానిని నియమించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎక్బైడ్ బాషా, కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభానుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయనను ఘనంగా సన్మానించారు.

గ్రామాల్లో అభివృద్ధిని చూడండి

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- పెండ్యాలలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



కంచికచర్ల మండలం పెండ్యాల ముస్లిం కాలనీలో సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల : గ్రామ స్వరాజ్యం సాధనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పెండ్యాలలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో సిమెంట్ రోడ్లు నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే కొబ్బరి కాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం జగన్ అభివృద్ధి, సంక్షేమంతోనే పాలన సాగిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇప్పటికే అంతర్గత గ్రావెల్ రోడ్లన్నీ సిమెంట్ రోడ్లుగా మార్చామన్నారు. ఎంపీ నిధులు రూ.30లక్షలు మంజూరయ్యాయని ఆ నిధులతో గ్రామంలో బీసీ, ముస్లిం ప్రాంతాల్లో సిమెంట్‌రోడ్లు వేసేందుకు పనులు చేపట్టాలన్నారు. సిమెంట్ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఉండాలని, ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అవసరమైతే నిధులు మంజూరు చేస్తామన్నారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని చూడాలే తప్ప, రాజకీయాలు చేయవద్దని అన్నారు. గ్రామస్థాయి నాయకుల మధ్య విభేదాలు తలెత్తితే గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని, ప్రతిఒక్కరూ సంయమనం పాటించి ఒకరినొకరు సహకరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో సర్పంచి షేక్ మలక్‌బాను ఎంపీటీసీ సభ్యుడు షేక్ బడేహజరత్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు షేక్ చాన్‌బహదూర్, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ పీర్‌సామియా, ఎంఎఫ్, నిష్సార్ పాషా, ఫయాంపాషా, అబ్దుల్‌కరీం పాల్గొన్నారు.

బాధ్యతగా వాహనాలు నడపాలి

రోడ్డు భద్రత వారోత్సవాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మొండితోక



రహదారి భద్రతకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే



రహదారి భద్రత వారోత్సవాల వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీవో

నందిగామ: ప్రాణం ఎంతో విలువైనదని, వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం రవాణా శాఖ అధికారులతో కలిసి వాల్ పోస్టర్, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాహన చోదకులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించడంతోపాటు, రవాణా శాఖ నిబంధనల ప్రకారం వాహనాల నడపాలన్నారు. అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వాహనాలు అతివేగంగా నడిపేటప్పుడు ఒక్కసారి మన కోసం ఎంతో ఆప్యాయతగా ఎదురుచూసే కుటుంబ సభ్యులను గుర్తు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం రవాణా శాఖ ఆధ్వర్యంలో భద్రత వారోత్సవాలు నిర్వహిస్తోందన్నారు.

ఆర్టీవో కార్యాలయంలో..

స్థానిక ఆర్టీవో కార్యాలయంలో రోడ్డు భద్రత వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను, గోడపత్రికలను ఏసీపీ నాగేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. అదే విధంగా వారోత్సవాలలో భాగంగా ప్రచారం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాన్ని ఆర్టీవో పద్మావతి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంబీఐ రాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్టీ రామారావు అందించిన సేవలు మరువలేనివని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని రైతుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి బుధవారం ఆయన పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఎన్టీ రామారావులు రాష్ట్రాభివృద్ధికి, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి ఎనలేనిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, పాములపాటి రమేష్, విశ్వనాథపల్లి కృష్ణారావు, వైఎస్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాల ఏర్పాటు అభినందనీయం

నరసింహారావుపాలెం(వీరులపాడు): గ్రామీణ ప్రాంతాలలో వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు పేర్కొన్నారు. మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో క్రాంతి కరుణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కాశియ్య నిర్మల్ వృద్ధాశ్రమ భవన నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి ఆసరా లేని నిరుపేదలకు అండగా నిలిచేందుకు ఫౌండేషన్ సభ్యులు ముందుకు రావటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ పసుపులేటి బ్రహ్మారావు, కార్యదర్శి తిరుపతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు మహ్మద్ సుభానీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సూర్యారాధన భారతీయ సంస్కృతిలో భాగం

విజయవాడ కల్చరల్: సూర్యారాధన భారతీయ సంస్కృతిలో భాగమని వేద పండితులు దెందుకూరి సుబ్రహ్మణ్య శర్మ అన్నారు. శృంగేరీ శారదాపీఠం ఆధ్వర్యంలో భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకల సందర్భంగా శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న స్యూర్యనారాయణ స్వామికి అర్చన, మహాసౌరం, అరుణం సౌరాష్ట్రరి మంత్ర జపం కార్యక్రమం బుధవారం భక్తిగా సాగాయి. ఆయన మాట్లాడుతూ వేద స్వరూపుడు సూర్యభగవానుడని ప్రత్యక్ష దైవంగా భావించ వచ్చన్నారు. సూర్యారాధన వల్ల పంచమహాపాతకులను విముక్తి పొందవచ్చని మనిషిలోని మానసిక రుగ్మతలను హరించవచ్చని తెలిపారు. భారతీయ పురాణాలలో సూర్యుడికి ప్రత్యేక స్థానముందన్నారు. ధర్మాధకారి హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం, సర్వమాన వాళి శ్రేయస్సుకు జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి ఆదేశంతో 73 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాగ క్రతువులను భక్తులు స్వయంగా వీక్షించవచ్చన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రుత్వికులు సూర్యారాధనలో పాల్గొన్నారు. సూర్య యంత్రానికి పూజలు నిర్వహించారు.

సర్వే సక్రమంగా నిర్వహించాలి

జిల్లా సర్వే అధికారి సూర్యారావు



సర్వే సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా అధికారి

నందిగామ: రీ సర్వే కార్యక్రమంలో పాల్గొనే సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని ఎన్టీఆర్ జిల్లా సర్వే, భూ రికార్డుల అధికారి కె. సూర్యారావు సిబ్బందికి సూచించారు. నందిగామ మండలం పల్లగిరి ప్రాంతంలో డ్రోన్ ద్వారా జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా రీసర్వే కార్యక్రమంలో పాల్గొనే సిబ్బంది బాధ్యతగా వ్యవహరించడంతోపాటు సమయపాలన పాటించాలన్నారు. విధులు నిర్వర్తిస్తున్న సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ప్రతిరోజు రీ సర్వేకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియపరచాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సర్వే అధికారి రవీంద్ర ప్రసాద్, మండల సర్వేయర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘ సేవలు అభినందనీయం



కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, బ్యాంక్ సిబ్బంది

నందిగామ: సహకార సంఘాల ద్వారా రైతులకు అందుతున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ నందిగామ మండల ఏటిపట్టు గ్రామాలకు కన్వీనర్ దేవినేని రామారావు పేర్కొన్నారు. మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన నక్కా వెంకటరత్నం (86) అనే రైతు మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కేడీసీసీ బ్యాంక్ సిబ్బంది బుధవారం నాడు గ్రామానికి వెళ్లి మట్టి ఖర్చుల కోసం రూ. 10 వేల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు ద్వారా రైతులకు చేస్తున్న సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్రపాటి అచ్చారావు, ఎంపీటీసీ సభ్యుడు అప్పికట్ల సురేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దేవినేని నాగేశ్వరరావు, తోట నరేష్ పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



బ్యానర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకోవాలని, మద్యం మత్తులో వాహనాలను నడిపితే లైసెన్స్ రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో తరచూ జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి డీఆర్ఎస్‌పీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 50 శాతం ద్విచక్ర వాహనాలే కారణమవుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిర్లక్ష్యంగా, అతివేగంతో వాహనాలను నడిపి, ప్రమాదాలకు గురైన వారు కుటుంబ సభ్యులతో పాటు తోటి ప్రయాణికులను కోలుకోలేని పరిస్థితుల్లోకి నెడుతున్నారన్నారు. వారం రోజులు పాటు నిర్వహించే రహదారి భద్రతా వారోత్సవాల్లో ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన కల్పించేలా కార్యక్రమాలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. డీటీసీ పురేంద్ర మాట్లాడుతూ ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి, వారిని చైతన్యవంతులు చేసేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం రవాణా శాఖ, పోలీస్, మోటార్ ఇన్సూరెన్స్ కంపెనీల ఉద్యోగులు విద్యార్థులతో మోటార్ వెహికల్ అమెండ్‌మెంట్ యాక్ట్ పై అవగాహన కల్పించడంతో పాటు ఇన్సూరెన్స్ విధానంపై వర్క్ షాపు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 20వ తేదిన పాఠశాల విద్యార్థులతో రోడ్డు సేఫ్టీ స్కూల్‌బస్ సేఫ్టీ అవగాహన కల్పించడంతో పాటు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను, 21వ తేదీన మెడికల్ క్యాంప్ నిర్వహించి, డ్రైవర్లకు కంటి, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 22వ తేదీన ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించి, హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తామన్నారు. 23వ తేదీన పోలీస్, ట్రాన్స్‌పోర్టు అధికారులు సంయుక్తంగా ట్రాఫిక్ సింబల్స్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. 24న రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమాలను నిర్వహించి రోడ్డు భద్రతలో ఉత్తమ సేవలందించిన పోలీస్, వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖ అధికారులకు ప్రశంస పత్రాలను అందజేయాలని డీటీసీ పురేంద్ర తెలిపారు. తొలుత రోడ్డు భద్రతా వారోత్సవాల ప్రచార వాహనాన్ని, వాల్ పోస్టర్లను, బ్యానర్లను కలెక్టర్ విడుదల చేశారు. సమావేశంలో డీసీపీ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ మోషే, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.సుహాసిని పాల్గొన్నారు.

కనకదుర్గనగర్‌లో పొంగలి పొయ్యిలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు పొంగలి నైవేద్యం వండేందుకు భక్తులు పడుతున్న ఇబ్బందులకు తాత్కాలికంగా పరిష్కారం లభించింది. కనకదుర్గనగర్‌లోని ప్రసాదాల కౌంటర్ల వద్ద దేవస్థానం తాత్కాలికంగా 14 కట్టె పొయ్యిలను ఏర్పాటు చేసింది. గతంలో ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద రేకుల షెడ్డులో భక్తులు పొంగళ్లు వండుకునేందుకు గ్యాస్ పొయ్యిలను ఏర్పాటు చేసి రుసుం వసూలు చేసేది. అయితే భద్రతా కారణాల చేత షెడ్డులో ఏర్పాటు చేసిన గ్యాస్ పొయ్యిలను తొలగించి క్లోక్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత మహా మండపం దిగువన ఆరు బయట భక్తులు పొంగళ్లు వండి అమ్మవారికి సమర్పించే వారు. కనీసం తాత్కాలిక ఏర్పాట్లు అయినా చేయాలని కోరడంతో దేవస్థానం కనకదుర్గనగర్‌లో ఇటుకలతో పొయ్యిల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఈమేరకు బుధవారం దేవస్థాన ఇంజినీరింగ్ సిబ్బంది ఈ పొయ్యిలను ఏర్పాటు చేశారు. గురువారం నుంచి భక్తులు పొంగళ్లు వండుకునేందుకు అనుమతి ఇస్తారని ఆలయ సిబ్బంది పేర్కొంటున్నారు.

రీ సర్వేతో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం

ప్రభుత్వ విప్ ఉదయభాను



డ్రోన్ ఆన్ చేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను



డ్రోన్‌ల పని తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

తిరుమలగిరి(జగ్గయ్యపేట అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా భూములు, ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న మహాయజ్ఞం జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని తిరుమలగిరి గ్రామంలో బుధవారం జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కార్యక్రమాన్ని ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించే విధంగా జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం ద్వారా భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టారని తెలిపారు. దాదాపు 100 ఏళ్ల తర్వాత సమగ్ర స్థాయిలో భూసర్వే జరుగుతోందని, దీనిలో పూర్తిస్థాయి ఆధునిక టెక్నాలజీ ద్వారా డ్రోన్ లను వినియోగించి, అక్షాంశాలు, రేఖాంశాలతో సహా పారదర్శకంగా సర్వే నిర్వహించి హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. తద్వారా దశాబ్దాల నాటి భూ వివాదాలు పరిష్కారం కావడంతో పాటు భవిష్యత్‌లో కూడా ఎలాంటి వివాదాలు ఏర్పడకుండా పాత భూ రికార్డులను ప్రక్షాళన చేస్తూ రీసర్వే ద్వారా కొత్త భూ రికార్డులు నమోదు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, నందిగామ ఆర్డీవో రవీంద్రరావు, పేట తహసీల్దార్ నాగేశ్వరరావు, పి. వసంతరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారానికే రీ సర్వే..

నందిగామ టౌన్: భూ సమస్యల పరిష్కారానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం ద్వారా భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని పల్లగిరి గ్రామంలో డ్రోన్‌లతో నిర్వహిస్తున్న భూముల సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది కలగకుండా సర్వే నిర్వహించాలన్నారు. అనంతరం డ్రోన్‌ల పని తీరు, తదితర వివరాలను అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఆర్డీవో రవీంద్ర, తహసీల్దార్ నరసింహారావు, సర్పంచ్ రవికిరణ్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రాము తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో మన రాష్ట్రం బెస్ట్



గృహ ప్రవేశం చేస్తున్న జెడ్పీటీసీ దేవమణి

వత్సవాయి(పెనుగంచిప్రోలు): సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ముందున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు ఏసుపోగు దేవమణి అన్నారు. బుధవారం మండల కేంద్రం వత్సవాయిలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు జగనన్న నూతన గృహ ప్రవేశాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గూడు లేని నిరుపేదలకు జగనన్న గృహాలు మంజూరు చేసి వారి జీవితంలో వెలుగులు నింపారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సీతమ్మ, వైస్ ఎంపీపీ కె. వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గాదెల రామారావు, మాజీ సర్పంచ్ గుత్తా శంకరరావు, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

పల్లె నుంచి పట్నం బాట



కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

కంచికచర్ల : తెలుగు పండుగ సంక్రాంతి పర్వదినం సందర్భంగా పల్లె బాట పట్టని పట్టణ ప్రజానీకం మూడు రోజుల పాటు కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపి తిరుగు పయనమయ్యారు. అయితే ఈనెల 17వ తేదీన మంగళవారం కావటంతో ఎక్కువమంది ప్రజలు ప్రయాణాన్ని వాయిదా వేశారు. బుధవారం కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజా వద్ద కార్లు, ఇతర వాహనాలు సాయంత్రం బారులుదీరాయి. టోల్‌ప్లాజా వద్ద పాస్టాగ్ సిస్టం ఏర్పాటు చేయటంతో మూడు సెకన్ల కన్నా మించి సమయం ఆగకుండా వాహనాలు తరలివెళ్లాయని స్వర్ణటోల్ ప్లాజా మేనేజర్ జయ ప్రకాష్ తెలిపారు.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభించి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని

వీరులపాడు: వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌వో సుహాసిని అన్నారు. మండలంలోని అల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రంగాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలను గుర్తించి వారు విధిగా పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. అంతే కాకుండా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాట నాణ్యమైన వైద్య సేవలందించాలని తెలిపారు. ముఖ్యంగా పీహెచ్‌సీలకు వచ్చే రోగుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గౌతమ్, సర్పంచ్ రమావత్ కోటి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నాడు అధ్వానంగా.. నేడు అద్దంలా..





గోతులతో అధ్వానంగా ఉన్న ముచ్చింతాల-తాళ్లూరు రహదారి, ప్రస్తుతం ఇది పరిస్థితి

జగ్గయ్యపేట నియోజకవర్గంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రహదారులు ఛిద్రమై అధ్వానంగా ఉన్న పలు రహదారులు ప్రస్తుతం అద్దంలా మారుతున్నాయి. ఆయా రహదారులపై వెళ్లేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులు గుర్తించిన స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నూతన రహదారుల నిర్మాణం, మరమ్మతులు చేపట్టారు. మండలంలోని ముచ్చింతాల నుంచి వత్సవాయి మండల తాళ్లూరు వరకు సుమారు రూ.2 కోట్లు వెచ్చించి రహదారి మరమ్మతులు పూర్తి చేయించారు. - ముచ్చింతాల(పెనుగంచిప్రోలు)